సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం, 28, జూన్, 2024



అరటి సాగు.. లాభాలు బాగు


సీజన్ ఏదైనా అరటి సాగులో రైతులకు లాభాలు తెచ్చిపెడుతుందని రామచంద్రపురం డివిజన్ ఉద్యాన అధికారి అనూష తెలిపారు. - 8లో



కేవీకేల సేవలు దేశానికే గర్వకారణం

కృషి విజ్ఞాన కేంద్రాల (కేవీకే) ద్వారా అందిస్తున్న రైతు సేవలు, విస్తరణ కార్యక్రమాలు దేశానికే గర్వకారణమని ఐసీఏఆర్ - అటారి డైరెక్టర్ షేక్ ఎన్ మీరా అన్నారు. - 8లో

డెల్టాలకు 9,550 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 9,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,900, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.25 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

వైభవంగా మహాసౌర యాగం



కేశనకుర్రుపాలెంలో సౌరయాగం నిర్వహిస్తున్న పండితులు

ఐ.పోలవరం: కేశనకుర్రుపాలెంలో శ్రీరాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీరుద్ర, శతచండీ, మహాసౌర యాగం వైభవంగా జరుగుతోంది. గురువారం ఆలయంలో గణపతి పూజ, మహాన్యాసం, శ్రీరుద్రాభిషేకం, శత సహస్ర బిల్వార్చన, సూర్య నమస్కారాలు, చండీ పారాయణ, మహాసౌర హోమం, చండీ హోమం, రుద్ర హోమం, సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజ, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు జరిగాయి. ఈ యాగ ఆచార్యులుగా ఆగమ విశారద కాళ్లకూరి దుర్గాప్రసాద్‌శర్మ, యాగ బ్రహ్మ కాళ్లకూరి కామేశ్వరశర్మ, వెలవల్లి చంద్రశేఖర్‌శర్మ వ్యవహరిస్తున్నారు. ఈ యాగాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. భక్తులకు నిత్యం అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది.

పీజీ సెట్ ఫలితాల్లో ప్రతిభ



సత్యవాణి



దినేష్

ఉప్పలగుప్తం: ఇటీవల ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహించిన ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో ఉప్పలగుప్తం మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఏయూ గురువారం విడుదల చేసిన పీజీ సెట్ ఫలితాల్లో మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి వాసంశెట్టివారిపాలానికి చెందిన కేశనకుర్తి వీర వెంకట సత్యవాణి స్టాటిస్టిక్స్ విభాగంలో రెండవ ర్యాంకు సాధించింది. మండలంలో కిత్తనచెరువు పంచాయతీ పరిధి పాతాళదిబ్బ ప్రాంతానికి చెందిన జంగా దినేష్ మైథడాలజీ (సోషల్ స్టడీస్) విభాగంలో ఏడవ ర్యాంకు సాధించాడు. పీజీ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాకులు సాధించడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వారిని అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందడంతో ఇప్పటి వరకూ డీసీసీబీ చైర్మన్‌గా పని చేసిన ఆకుల వీర్రాజు తన పదవికి రాజీనామ చేశారు. దీంతో ప్రభుత్వం జేసీని పర్సన్ ఇన్‌చార్జిగా నియమించింది.

నేడు సత్యదేవుని హుండీల ఆదాయం లెక్కింపు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో హుండీల ఆదాయాన్ని శుక్రవారం లెక్కించనున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి దేవస్థానం సిబ్బంది అందరూ విధిగా హాజరు కావాలని ఈఓ కె.రామచంద్ర మోహన్ ఆదేశించారు. గత నెల 29న సత్యదేవుని హుండీ కానుకలను లెక్కించారు. తిరిగి 30 రోజుల తరువాత ఆదాయం లెక్కిస్తున్నారు. గత నెల రోజులు భక్తులు అధికంగా వచ్చినందున స్వామివారి హుండీ ఆదాయం సుమారు రూ.1.50 కోట్లు పైగా వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

30 నుంచి రెండో విడత డీఈఈ సెట్ కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ, ప్రైవేటు డీఈఎల్ ఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు డీఈఈ సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ఈ నెల 30న ప్రారంభం కానుంది. జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఏఎం జయశ్రీ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకూ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో కళాశాలల వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు. జూలై 5 నుంచి 7వ తేదీ వరకూ సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 9న ప్రొవిజనల్ లెటర్ జారీ చేస్తారని, ఆ రోజు నుంచి 13వ తేదీ వరకూ సంబంధిత డైట్ సంస్థల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని వివరించారు.

కోటసత్తెమ్మ తల్లికి రూ.24.08 లక్షల హుండీ ఆదాయం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారికి హుండీల ద్వారా దండిగా ఆదాయం లభించింది. జిల్లా దేవదాయ శాఖ అధికారి వి.సోమరాజు పర్యవేక్షణలో 91 రోజులకు హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. నగదు రూపేణా రూ.24,08,126, అన్నదాన ట్రస్ట్ హుండీలో రూ.23,241, బంగారం 28 గ్రాములు, వెండి 217 గ్రాములు, రెండు విదేశీ డాలర్లు లభించాయని ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

ప్రయోగాలు ఉపయోగమేనా?

- సైన్స్ ల్యాబ్స్ ఎలా పని చేస్తున్నాయి
- 13 అంశాలపై పరిశీలన చేయనున్న అధికారులు
- జిల్లాలో 45 అటల్ టింకరింగ్, 12 స్టెమ్, 30 పాల్ ల్యాబ్స్
- త్వరలో అటల్ ల్యాబ్స్ హెచ్‌ఎంలతో కలెక్టర్ సమీక్ష



అటల్ ల్యాబ్‌లో ప్రాక్టికల్ చేస్తున్న విద్యార్థులు

రాయవరం: పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయుడు కృత్యాధార బోధన చేయాలి. ముఖ్యంగా సైన్స్ విద్యార్థుల్లో పరిశీలనాశక్తిని పెంచి, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసే విధంగా బోధన చేయాలి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు గతంలో కేంద్ర ప్రభుత్వం అటల్ టింకరింగ్ ల్యాబ్స్ మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వాలు స్టెమ్ ల్యాబ్స్ మంజూరు చేశాయి. త్వరలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా మరిన్ని స్టెమ్ ల్యాబ్స్ పాఠశాలలకు మంజూరు కానున్నాయి. పీఎంశ్రీ పాఠశాలలకు ప్రత్యేకంగా అటల్ ల్యాబ్స్ కూడా మంజూరు కానున్నాయి.

పర్యవేక్షణ పెంపు

ఉపాధ్యాయుడిని తరగతికి పరిమితం చేయాలన్న ఆలోచనలకు అనుగుణంగా ప్రయోగశాలలపై పర్యవేక్షణను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పెంచారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్, స్టెమ్ ల్యాబ్స్, పాల్ ల్యాబ్స్ నిర్వహణ ఏ విధంగా జరుగుతుందన్న విషయాన్ని నిరంతరం పర్యవేక్షణ చేయాల్సి ఉంది. పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రయోగాలు ఎంతవరకు ఫలవంతమవుతున్నాయి? విద్యార్థులకు ప్రయోగాలు ఎంత మేర చేరుతున్నాయి? విద్యార్థులను ఎంత వరకు భాగస్వాములను చేస్తున్నారు? తదితర విషయాలను ఎప్పటికప్పుడు పరిశీలన చేసి జిల్లా సైన్స్ అధికారి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 45 అటల్ టింకరింగ్, 12 స్టెమ్ ల్యాబ్స్, 30 పాల్ ల్యాబ్స్ ఉన్నాయి. గణితాన్ని సులువుగా విద్యార్థులకు అందజేసేందుకు గతంలోనే పాల్‌ల్యాబ్స్‌ను మంజూరు చేశారు.

ప్రయోగాలను మరింత చేరువ చేసేందుకు

విద్యార్థి తాను నేర్చుకున్న విషయాన్ని ప్రయోగపూర్వకంగా చూసినప్పుడు మరింత అవగాహన పెంచుకోవడానికి అవకాశముంటుంది. తాను విన్న, చూసిన విషయాన్ని జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేడు. అందుకే ముఖ్యంగా సైన్స్ బోధనలో ప్రయోగాలకు ప్రాధాన్యముంది. దీన్ని గ్రహించి గత ప్రభుత్వంలోనే సిమ్యులేషన్ విధానంలో ప్రయోగాలు ఏ విధంగా నిర్వహించాలి? అనే అంశంపై జిల్లా వ్యాప్తంగా ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు ప్రయోగాలపై ఇచ్చిన శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది. దీనికి తోడు పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌ను అందజేశారు. ఈ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా ప్రయోగాల నిర్వహణ విద్యార్థి మనసును మరింతగా హత్తుకుంటుంది. జిల్లావ్యాప్తంగా 486 మంది గణితం, 327 మంది ఫిజికల్ సైన్స్, 346 బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు సిమ్యులేషన్ విధానంలో శిక్షణ ఇచ్చారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్స్ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పీఎంశ్రీ పాఠశాలలకు సైన్స్ ల్యాబ్స్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

ల్యాబ్‌ల పరిశీలన

పాఠశాలల్లో ఉన్న అటల్ టింకరింగ్, స్టెమ్, పాల్ ల్యాబ్స్ నిర్వహణ ఏ విధంగా సాగుతోందన్న విషయాన్ని పరిశీలించేందుకు జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షణ చేయనున్నారు. ల్యాబ్‌ల పరిస్థితి, ప్రస్తుతం పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రయోగాలు, ల్యాబ్‌లలో నిర్వహిస్తున్న రికార్డులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటారు. పాఠశాలల్లో ఉన్న సైన్స్ ల్యాబ్స్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకుని రావాలన్న సంకల్పంతో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉన్నారు. అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు.

13 క్వాలిటీ ఇండికేటర్లు

అటల్ ఇన్నోవేషన్ మిషన్ పోర్టల్‌లో గత నెలకు సంబంధించి పాఠశాలలో చేసిన ప్రయోగాలు, యాక్టివిటీస్‌ను 15 రోజులలోపు అప్‌లోడ్ చేయాలి. ఆఫ్‌లైన్ క్యాష్‌బుక్ అండ్ లెడ్జర్ నిర్వహించాలి. ప్రతి విద్యార్థిలో డిజైన్ థింకింగ్ అభివృద్ధి చేయాలి. ఇచ్చిన కాంపొనెంట్స్‌ను ఒక క్రమపద్ధతిలో అమర్చాలి. సందేహాల నివృత్తికి ఏఎం పోర్టల్‌లో ప్రశ్నలు సంధించాలి. ప్రతి కాంపొనెంట్ రస్ట్ పట్టకుండా పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచాలి. అటల్ క్యాలెండర్‌ను మెయింటెన్ చేయాలి. ప్రభుత్వం నిర్వహించే ఆన్‌లైన్ యాక్టివిటీస్‌లో పాల్గొనాలి. అటల్ ఇన్నోవేషన్ మిషన్ నిర్వహించే కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనాలి. అటల్ ల్యాబ్‌లో ఉన్న అన్ని టూల్స్ పనిచేయాలి. టైమ్‌టేబుల్‌లో తప్పనిసరిగా వారానికి రెండు పీరియడ్లు అటల్ ల్యాబ్‌కు కేటాయించాలి. ఒక అటల్ నోడల్ టీచర్‌ను నియమించాలి, ఆ టీచర్ తప్పనిసరిగా ఫిజికల్ సైన్స్ టీచర్ అయి ఉండాలి. జిల్లాలో ఉన్న అటల్ టింకరింగ్, స్టెమ్, పాల్ ల్యాబ్స్ ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమీక్ష చేయనున్నారు.

ఉపరితల ఆవర్తనం

- జిల్లావ్యాప్తంగా వాన
- తడిసి ముద్దయిన రాజోలు దీవి
- ఉదయం నుంచి రాత్రి వరకు జల్లులు
- చల్లబడిన వాతావరణం
- తీరిన తాపం

సాక్షి, అమలాపురం: గ్రీష్మతాపం తీరేలా జిల్లాలో విస్తారంగా వర్షం కురిసింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా బుధవారం సాయంత్రం చిరు జల్లులు పడిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా గురువారం తెల్లవారు జామున ఒక మోస్తరు నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. జిల్లాలో బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి గురువారం ఉదయం ఎనిమిది గంటల వరకు సగటున 16.6 మి.మీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా మలికిపురం మండలంలో 47.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కాట్రేనికోన మండలంలో 2.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షం పడింది. తరువాత కూడా వర్షం పడుతూనే ఉంది. రాజోలు దీవి వర్షానికి తడిసి ముద్దయ్యింది. మలికిపురం మండలంతోపాటు సఖినేటిపల్లి 45.4, రాజోలులో 44.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. వర్షాలకు ప్రధాన రహదారులపై నీరు చేరింది.

జిల్లాలో ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు అనుకున్న సమయానికే వచ్చినా, మే నెల చివరిలో రెమాల్ తుపాను వచ్చినా వేడి వాతావరణం తగ్గలేదు. తుపాను సమయంలోను, నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన తరువాత అడపాదడపా వర్షాలు పడుతున్నా ఉష్ణోగ్రతలు అధికంగానే ఉన్నాయి. మే నెలలో జిల్లావ్యాప్తంగా సగటున 80.4 మిలీమీటర్ల వర్షం కురవగా, జూన్ నెలలో 139.5 మిలీమీటర్ల వర్షం కురిసింది. అయినా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం విశేషం. రోహిణి కార్తెలో అంబాజీపేటలో ఏకంగా 42.5 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదైన విషయం తెలిసిందే. సుమారు పది రోజుల పాటు గ్రీష్మతాపం సామాన్యుడిని విలవిలలాడించింది. తిరిగి జూన్ 14 నుంచి 18 వరకు జిల్లా మరోసారి అగ్నిగుండంగా మారింది. 37 నుంచి 40 వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు చోటు చేసుకోవడంతో ఈ ఏడాది రెండవ వేసవిని జనం చవిచూసినట్టయింది. ఈ ప్రభావం ఖరీఫ్ సాగుపై పడింది. అనుకున్న దాని కన్నా నారుమడులు, నాట్లు ఆలస్యమవుతున్నాయి.

జిల్లాలో వర్షపాతం ఇలా..

జిల్లాలో అమలాపురం 30.2, పి.గన్నవరం 28.4, అంబాజీపేట 24.8, మామిడికుదురు 24.4,
కొత్తపేట 19.2, అల్లవరం 17.2, రాయవరం 12.8, అయినవిల్లి 9.8, ఆత్రేయపురం 8.6, రావులపాలెం 8.4, ఉప్పలగుప్తం 7.4, కపిలేశ్వరపురం 6.8, ఆలమూరు 6, ఐ.పోలవరం, రామచంద్రపురం 5.2, కె.గంగవరం 4.4, ముమ్మిడివరం 4.2, మండపేట 4 మిల్లీమీటర్ల చొప్పున వర్షం పడింది.



మామిడికుదురులో జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీరు

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

కలెక్టర్ హిమాన్షు శుక్లా




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన సామాజిక భద్రతా పింఛన్లు జూలై 1న పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉన్నతాధికారులు అమరావతి నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సామాజిక భద్రత పెన్షన్‌ను రూ. 3,000 నుంచి రూ.4,000కు పెంచుతున్నట్లు ప్రకటించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా వృద్ధాప్య పింఛన్లు 1,29,297, వితంతులు 49,806, చేనేత కార్మికులు, 5,252, కల్లుగీత కార్మికులు 3,241, మత్స్యకారులు 5,373, ఒంటరి మహిళలు 4,557, సంప్రదాయ చెప్పులు కుట్టేవారు 726,, ట్రాన్స్ జెండర్స్ 20, డ్రమ్ కళాకారులు 741, కళాకారులు 164 మంది పింఛను లబ్ధిదారులుగా ఉన్నారని తెలిపారు. రూ.3,000 నుంచి రూ.6,000కు పెంచిన పింఛన్లు వికలాంగులకు సంబంధించి 32,681, మల్టీ డిఫార్మిటీ లెప్రసీ పింఛన్లు122 ఉన్నాయన్నారు. రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెంచిన పింఛన్లు, పూర్తిగా వికలాంగత్వం కలిగిన పింఛన్లు 367, ఈ క్యాటగిరిలోనే పక్షవాత పింఛన్లు 114 ఉన్నాయని తెలిపారు. రూ. 5వేలచి నుండి పదివేల రూపాయల వరకు పెంచిన పింఛన్లకు సంబంధించి మూత్ర పిండాలు, తలసేమియా కేసులు వంటివి 112 ఉన్నాయని ఆయన తెలిపారు. కోనసీమ జిల్లాలోని 22 మండలాల పరిధిలో మొత్తం పెన్షన్లు 2,43,529 ఉండగా వీరికి గత మూడు నెలల బకాయి కలిపి జూలై 1వ తేదీన రూ.160, 89, 57,000 చెల్లించేందుకు రంగం సిద్ధమైందన్నారు. ఎంపీడీవో, తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి కార్యాలయాలు, గ్రామ సచివాలయాల సిబ్బంది పింఛన్ల పంపిణీ చేస్తారని చెప్పారు. ఒక్కొక్క ఉద్యోగి 50 మందికి పింఛన్ చెల్లించే విధంగా మ్యాపింగ్ చేశామని స్పష్టం చేశారు. డీఆర్‌డీఏ పీడీ శివశంకర్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రూ.కోట్లు కక్కించరా?

- ఈపీడీసీఎల్ స్టోర్స్ డిపార్ట్‌మెంట్‌లో రూ.1.50 కోట్ల కుంభకోణం
- విద్యుత్ సామగ్రి, తుక్కు పక్కదారి పట్టినట్లు నిర్ధారణ
- ఇప్పటికే ఏడీఈ సస్పెన్షన్
- విజిలెన్స్ విచారణకు సీఎండీ ఆదేశం
- ఇప్పటికీ నిగ్గు తేలని నిజాలు



సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్)లో రూ.కోట్లు కొల్లగొట్టినా పట్టించుకోరా.. విద్యుత్ సామగ్రి, తుక్కు పక్కదారి పట్టించినా ఉన్నతాధికారుల్లో స్పందన లేదా అంటే అవుననే అంటున్నారు ఆ శాఖ ఉద్యోగులు. రూ.1.50 కోట్ల కుంభకోణంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించినా నిజాలు నిగ్గు తేల్చకపోవడం వెనుక అంతర్యమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

ఏం జరిగిందంటే..

బొమ్మూరులోని ఈపీడీసీఎల్‌కు చెందిన స్టోర్స్ డిపార్ట్‌మెంట్ అత్యంత కీలకమైనది. రూ.కోట్ల విలువైన ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఖరీదైన సామగ్రి వరకూ ఇక్కడ ఉంచుతారు. విద్యుత్ వైర్లు, మీటర్ బాక్స్‌ల వంటి తుక్కు కూడా ఇక్కడే నిల్వ ఉంచుతారు. వర్కు ఇండెంట్లు, టెండర్ల ఆధారంగా స్టోర్ నుంచి సరకు, తుక్కు సరఫరా అవుతాయి. అంతే భద్రత కూడా ఉంది. ఇటువంటి స్టోర్స్ నుంచి కొందరు ఉద్యోగులు సుమారు నాలుగు నెలల కిందట రూ.కోట్ల విలువ చేసే విద్యుత్ సామగ్రి, తుక్కును దొడ్డిదారిన తరలించారు. ప్రభుత్వం నిర్మిస్తున్న పేదల ఇళ్లకు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, వైర్లు తదితర సామగ్రి పంపాలన్న సాకుతో ఇండెంట్ కంటే ఎక్కువ సామగ్రిని తరలించేశారు. అదనపు సామగ్రిని ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చి రూ.వేలల్లో ముడుపులు దండుకుంటున్నారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. సాధారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు తరలించాలంటే గేట్ పాస్ తప్పనిసరి. అయితే, గేటు వద్ద ఉన్న సిబ్బందిని సైతం మేనేజ్ చేసేస్తూ, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై వాటాలు వేసుకుని మరీ అమ్మేశారు. ఈవిధంగా రెండు లారీల తుక్కు సామగ్రిని టెండర్ లేకుండా ఇతరులకు విక్రయించారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఓ వ్యక్తి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా అప్పట్లో వారు మిన్నకుండిపోయారు. సరకు అక్రమ తరలింపుపై మరో వ్యక్తి వీడియో తీసి ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈకి పంపించారు. దీంతో కంగు తిన్న సదరు అధికారి వెంటనే ఆ విషయాన్ని సంస్థ సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. మొత్తం రూ.1.50 కోట్ల మేర సామగ్రిని కొల్లగొట్టినట్లు సీఎండీ దృష్టికి వెళ్లింది. దీనిపై విచారణ అనంతరం స్టోర్స్ ఏడీఈ వై.మధును అప్పట్లో సస్పెండ్ చేశారు. నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు ఓ ఐపీఎస్ అధికారిని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమించారు. అయితే విచారణ ముందుకు కదలడం లేదు. ఈ పరిస్థితుల్లో అక్రమార్కులు బదిలీల కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. దండుకున్న డబ్బుతో జారుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

విచారణ జరిగింది

స్టోర్స్ డిపార్ట్‌మెంటులో అవకతవకలపై విజిలెన్స్ సీఐ, ఎస్సై వచ్చి విచారణ చేపట్టారు. ఎలాంటి అవినీతి జరగలేదని నిర్ధారించారు. ఈ ఘటనలో ఇప్పటికే ఒక అధికారి సస్పెండ్ అయ్యారు.

– పీవీఎస్ఎన్ మూర్తి, ఎస్ఈ, ఏపీ ఈపీడీసీఎల్, రాజమహేంద్రవరం

కు.ని. అంటే వణుకే

- కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలకు దూరం అంటున్న పురుషులు
- విద్యావంతులదీ అదే దారి
- అపోహలతో మహిళల పైనే భారం



సాక్షి ప్రతినిధి, కాకినాడ: అనేక విషయాల్లో తమంత మొనగాళ్లు లేరంటూ చాలా మంది మగాళ్లు వీరుల్లా.. శూరుల్లా జబ్బలు చరుస్తూంటారు. తామే మగమహారాజులమంటూ మీసాలు మెలేస్తూంటారు. ఇంత హంగామా చేస్తున్న చాలా మంది మగాళ్లు ఎందుకనో కానీ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు (వేసక్టమీ) అంటే మాత్రం ముఖం చాటేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్నిచోట్లా ఈ పరిస్థితి కనిపిస్తోంది. మూఢనమ్మకాలు, ఆపరేషన్ చేయించుకుంటే భవిష్యత్తులో బలమైన పనులు చేయడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం అనేక మంది పురుషులను ఇప్పటికీ వీడటం లేదు. ఈ అపోహలతో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స బాధ్యత తమది కాదన్నట్టుగా జీవిత భాగస్వామి పైకే నెట్టేస్తున్నారు. ప్రస్తుతం వైద్యరంగంలో అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయి. కోత లేకుండానే బటన్ హోల్ పద్ధతిలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు, పురుషులకు ఇంజెక్షన్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. అయినప్పటికీ పురుషులు ఈ శస్త్రచికిత్సలంటేనే ఆమడ దూరాన ఉంటున్నారు. వేసక్టమీ ఆపరేషన్లపై పురుషులకు అవగాహన కల్పించడంలో సంబంధిత వ్యవస్థలూ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. కుటుంబ నియంత్రణలో దంపతులిద్దరిదీ సమాన బాధ్యత అనే అంశంపై వైద్య, ఆరోగ్య శాఖ ముమ్మర ప్రచారం చేసి, ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడంలో అంతగా ఆసక్తి చూపడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి.


వెనకడుగు వేస్తున్నారిలా..


- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వేలాదిగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ఈ ఆపరేషన్లు చేయించుకుంటున్న వారిలో 90 శాతం మంది ట్యూబెక్టమీ చేయించుకుంటున్న మహిళలే ఉంటున్నారు. పురుషులు దాదాపు వెనకడుగు వేస్తున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల వద్ద ఉన్న గణాంకాలే ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.
- తూర్పు గోదావరి జిల్లాలో గత ఏడాది వేసక్టమీ ఆపరేషన్లు చేయించుకున్న వారి లెక్కలు చూస్తే ఆశ్చర్యం కలగక మానదు. ఆ ఏడాది ఆ జిల్లా అంతటా కలిపి నలుగురు పురుషులు మాత్రమే వేసక్టమీ ఆపరేషన్లు చేయించుకోవడం గమనార్హం. గడచిన మూడేళ్ల లెక్కలు చూస్తే 10 మంది మాత్రమే ఉన్నారు. ఈ ఏడాది ఈ ఆరు నెలల్లో ఆరుగురు పురుషులు మాత్రమే కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించుకున్నారు. వచ్చే ఆరు నెలల్లో మరో నాలుగైదుకు మించే పరిస్థితి లేదని వైద్య, ఆరోగ్య శాఖాధికారులే చెబుతున్నారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2023–24లో 26 వేసక్టమీ ఆపరేషన్లు మాత్రమే జరిగాయి.
- కాకినాడ జిల్లాలో ఈ ఏడాది లెక్కలు పరిశీలిస్తే ఏ నెలా పట్టుమని పదికి మించి వేసక్టమీ ఆపరేషన్లు జరిగిన దాఖలాలు లేవు. జనవరిలో 2, ఫిబ్రవరిలో 8, మార్చి 4, ఏప్రిల్ 7, గత నెలలో ఏడుగురు పురుషులు మాత్రమే కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరిగాయి. ఈ లెక్కలు పరిశీలిస్తే పురుషులు వేసక్టమీ ఆపరేషన్లకు వెనకడుగు వేస్తున్న విషయం స్పష్టమవుతోంది.
- వేసక్టమీ చేయించుకుంటే ప్రభుత్వం రూ.1,100 నజరానా ఇస్తున్నప్పటికీ పురుషులు ముందుకు రావడం లేదు.
- మగవారికి చేసే ఈ శస్త్రచికిత్స సులువే అని తెలిసినప్పటికీ చాలా మంది వెనకడుగే వేస్తున్నారు. చదువుకోని వారు మాత్రమే కాదు.. విద్యావంతులైన పురుషులు సైతం వేసక్టమీపై ఆసక్తి చూపడం లేదు.

సిజేరియన్‌తో పాటే..

ప్రస్తుతం ప్రతి పది మంది దంపతుల్లో ఏడెనిమిది మంది ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకుంటున్నారు. కాన్పు కోసం వెళ్లిన సమయంలో ఇక పిల్లలు వద్దనుకునే వారు మహిళలకు సిజేరియన్‌తో పాటు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స కూడా చేయించేస్తున్నారు. మెజార్టీ వైద్యులు సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇవ్వకుండా డబ్బు కోసం సిజేరియన్ కాన్పులు చేస్తున్నారు. పనిలో పనిగా మహిళలకు ట్యూబెక్టమీ ఆపరేషన్లు కూడా చేసేస్తున్నారు.

వేసక్టమీ ఆపరేషన్లే సులువు





కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల్లో మహిళలకు చేసే ట్యూబెక్టమీ కంటే పురుషులకు చేసే వేసక్టమీయే చాలా సులువు. కేవలం 5 నిమిషాల వ్యవధిలోనే ఈ ఆపరేషన్ పూర్తవుతుంది. ఈ ఆపరేషన్ చేయించుకున్న పురుషులు ఒక రోజు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది. వారం రోజుల పాటు బరువులు ఎత్తకూడదు. అదే మహిళలైతే వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలి. ఎలాంటి భయాలు, అపోహలు లేకుండా వేసక్టమీ ఆపరేషన్లు చేయించుకునేందుకు పురుషులు ముందుకు రావాలి.

– డాక్టర్ జె.నరసింహ నాయక్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, కాకినాడ
– డాక్టర్ సూర్యప్రభ, సూపరింటెండెంట్, బోధనాస్పత్రి, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలి మృతి


గాంధారమ్మ (పాతచిత్రం)

ఆలమూరు: మండలంలోని నర్శిపూడిలో గురువారం శతాధిక వృద్ధురాలు కొక్కిరమెట్ల గాంధారమ్మ (112) మృతి చెందారు. ఆమె ఈ నెల 10న ఇంట్లో ప్రమాదవశాత్తూ జారి పడిపోయారు. కాలికి తీవ్ర గాయం కాగా స్థానిక వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి మృతి చెందారు. గాంధారమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఒకు కుమారుడు ఉన్నారు. కుమార్తె, కుమారుడు ఇప్పటికే మృతి చెందారు. మనువలు, ముని మనవలు, అను మనవలు కలిసి సుమారు 120 మంది కుటుంబసభ్యులు ఉన్నట్టు స్థానికులు తెలిపారు.

'నన్నయ'లో పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు పూర్తి


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశాలకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు గురువారంతో ముగిశాయి. ఏపీఆర్ సెట్‌లో అర్హత సాధించిన జియాలజీ, మేనేజ్‌మెంట్ విభాగాల విద్యార్థులకు ఈ ఇంటర్వ్యూలు జరిగాయి. జియాలజీ విభాగంలో 34 మంది అర్హత సాధించగా 25 మంది, మేనేజ్‌మెంట్ విభాగంలో 321 మంది అర్హత సాధించగా 261 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని వీసీ ఆచార్య కె. పద్మరాజు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న వాహనం

ప్రయాణికులకు స్వల్పగాయాలు


దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

నల్లజర్ల: గ్రామ శివార్లో గురువారం సాయంత్రం ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న ఆర్.టి.సీ బస్సును ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. బస్సు పక్కనే ఉన్న పంటకాలువలోకి దూసుకెళ్లింది.బస్సులో 54మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో కొంతమందికి స్వల్పగాయాలయ్యాయి. బొలెరో వాహనంలో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వీరందరినీ ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అరటి సాగు.. లాభాలు బాగు

- ఏ సీజన్‌లోనైనా డిమాండ్
- దాదాపు నష్టం ఉండదు
- జిల్లాలో 15 వేల ఎకరాల్లో పెంపకం


ఎం.అనూష

రాయవరం: ఏ సీజన్‌లోనైనా అరటి కాయలకు మంచి డిమాండ్ ఉంటుంది. పైగా ఈ పంటను ఏ సీజన్‌లోనైనా సాగు చేసుకోవచ్చు. అరటిలో కేవలం పంటే కాకుండా ఆకులు, పిలకలకు కూడా మంచి గిరాకీ ఉంటుంది. లాభాలు తప్ప దాదాపుగా నష్టాలు ఉండవు. అందుకే రైతులు అరటి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో సుమారుగా 15వేల ఎకరాల్లో రైతులు అరటి సాగు చేపడుతున్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే అరటి సాగులో అధిక లాభాలు సాధించవచ్చునంటున్నారు రామచంద్రపురం డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి ఎం.అనూష. సాగు విధానం, పాటించాల్సిన పద్ధతులు ఆమె మాటల్లోనే..

ఉష్ణ మండల పంట

అరటిని ఏడాది పొడవునా సాగు చేయవచ్చు. ఇది ఉష్ణమండల పంట. 10 నుంచి 40 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతల్లోనూ దిగుబడి వస్తుంది. 46 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఉన్నా అరటిలో అధిక ఫలసాయం పొందడానికి వీలుంటుంది. ఉష్ణోగ్రత తక్కువగా ఉంటే గెలల్లో ఎదుగుదల తగ్గిపోతుంది. ఏడాది పొడవునా అరటిని సాగు చేయవచ్చు. గ్రాండ్ నైన్ రకం అధిక దిగుబడినిస్తుంది. నీరు ఇంకే సారవంతమైన నేలలు అరటి పంటకు అనుకూలం. చౌడు భూములు అరటి పంటకు అనుకూలం కావు. భూమిని బాగా దుక్కి చేసి, చదును చేసిన తర్వాత ఆరడుగుల పొడవు,. ఐదడుగుల వెడల్పుతో లేదా ఐదున్నర అడుగుల పొడవు వెడల్పుతో నాటుకోవాలి. 1.5 అడుగుల గుంతలు తవ్వాలి. గుంత పైభాగం మట్టికి 5కిలోల పశువు ఎరువు, 300గ్రాముల ఆముదం లేదా వేప పిండి, 150 గ్రాముల సూపర్‌ఫాస్పేట్ కలిపి గుంతలు పూడ్చాలి. నీరు పెడితే గుంతలో మట్టి సర్దుకుంటుంది. టిష్యూకల్చర్ మొక్కలను మట్టి, గడ్డి చెదరకుండా పాలథీన్ సంచులను తీసి, గుంత మధ్యలో పెట్టి తిరిగి డ్రిప్ ద్వారా నీరు పెట్టాలి.


మొక్క అరటి తోట


కాపు కొచ్చిన అరటి తోట

పాడి-పంట

ఎరువుల వాడకం ఇలా..

టిష్యూకల్చర్ అరటి మొక్కలకు పోషక పదార్థాలు నిల్వ ఉండే దుంపలుండవు. ఇవి నాటిన వెంటనే తొందరగా పెరగవు. ఎరువులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటాయి. నాటిన నాలుగు నుంచి ఐదు నెలలకు గెల అంకురం ఏర్పడి హస్తాలు, కాయల సంఖ్య నిర్ణయమవుతుంది. ఈ దశ అరటి చెట్టు పెరుగుదలలో చాలా కీలకమైనందున పోషకాల లోపం లేకుండా సిఫారసు మేరకు ఎరువులు అందించాలి. లేకుంటే గెలలో హస్తాలు, కాయల సంఖ్య తగ్గుతుంది. ఆ తర్వాత వేసే ఎరువులు చెట్లు, కాయల వృద్ధికి ఉపయోగపడతాయే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఎరువులను గుంతల్లో వేయడంతో పాటు, మొక్కలు నాటిన రెండో వారం నుంచి డ్రిప్ పద్ధతిలో నీరందించాలి. టిష్యూ కల్చర్ అరటి చెట్లకు ఎరువులను డ్రిప్ ద్వారా వేస్తే అధిక ఖర్చు అవుతుంది. ఎరువులను రోజూ గాని, 2-3 రోజులకు గాని, వారానికి ఒకసారి గాని అందించవచ్చు. పోషకాల వినియోగంలో టిష్యూకల్చర్ అగ్రగామి. ఒక టన్ను ఆరటికాయల దిగుబడికి 8కిలోల నత్రజని, 1.5 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ ను వినియోగించుకుంటుంది. దీని ప్రకారం ఎకరానికి 30 టన్నుల దిగుబడికి 240 కిలోల నత్రజని, 45 కిలోల భాస్వరం, 600 కిలోల పొటాష్ వేయాలి.

పిలకలు ఎప్పటికప్పుడు తీసేయాలి

సాధారణంగా అరటి చెట్టు 3 నుంచి 8 పిలకలు వేస్తుంది. అవసరానికి మించి నత్రజని వేసినప్పుడు, తల్లిచెట్టుకు దెబ్బతగిలినప్పుడు, అవసరానికి మించి మట్టి ఎగదోసినప్పుడు పిలకలు ఎక్కువగా వస్తాయి. వీటిని ఎప్పటికప్పుడు తీసివేయాలి. లేకుంటే భూమిలోని పోషకాలను తల్లిచెట్టుతో సమానంగా ఉపయోగించుకుని పోటీపడి పెరిగి తెగుళ్లు, పురుగుల బెడదను పెంచుతాయి. పిలకలను ఆకుల కింద భాగంలో కోసి, మధ్యభాగాన్ని పొడిచిన వెంటనే 10-20 చుక్కల కిరోసిన్‌ను ఇంక్ ఫిల్లర్ లేదా సిరంజీతో వేస్తే మళ్లీరావు.

హాస్టల్ విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు


కొక్కిరిపాటి సంజు

కొవ్వూరు: పట్టణంలో బీసీ హాస్టల్‌కి చెందిన పదో తరగతి విద్యార్థి కొక్కిరిపాటి సంజు ఈ నెల 26వ తేదీ ఉదయం నుంచి కనిపించడం లేదని అతడి తల్లి అరుణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై ఎండీ జుబేర్ తెలిపారు. గోపాలపురం మండలం గుడ్డిగూడెం గ్రామానికి చెందిన సంజు వారం క్రితమే హాస్టల్‌లో చేరినట్లు పేర్కొన్నారు. నాలుగు రోజుల క్రితం కుక్క కరిచిందని ఇంటికి వెళ్లాడు. తిరిగి అయిష్టంగానే హాస్టల్‌కి వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీ ఉదయం స్కూలుకి వెళుతున్నట్లు చెప్పి, బస్టాండ్‌లో బస్సు ఎక్కి వెళ్లినట్లు స్నేహితుడి ద్వారా తెలిసిందన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కిర్లంపూడి: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదైనట్లు కిర్లంపూడి ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. సామర్లకోటకు చెందిన ఉప్పాడ దుర్గాప్రసాద్, మందేటి బాబీ బుధవారం బాలరాజుపేటలోని వారి స్నేహితుడు అత్తమూరి కృపారావు పెళ్లికి వచ్చారు. ఇద్దరూ కిర్లంపూడిలోని శివాలయం వద్ద ఉన్న శ్మశాన వాటిక వద్దకు బహిర్భూమికి వెళ్లారు. అదే గ్రామానికి చెందిన ఉమ్మిడిశెట్టి నానాజీకి, వారికి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కులం పేరుతో దూషించారని ఉప్పాడ దుర్గాప్రసాద్, మందేటి బాబీ ఇచ్చిన ఫిర్యాదుతో నానాజీపై ఎస్సీ,ఎస్టీ కేసునమోదు చేసినట్లు జబీర్ తెలిపారు.

మోటార్ సైకిలిస్టు దుర్మరణం

గండేపల్లి: జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఏలేశ్వరం మండలం లింగంపర్తికి చెందిన చంద్రపాటి లోవరాజు (44) సుమారు మూడేళ్ల నుంచి అత్తగారి ఇంట మండలంలోని మల్లేపల్లిలో కుటుంబ సమేతంగా నివాసం ఉంటూ పామాయిల్ గెలలు కోసే పనులకు వెళుతున్నాడు. గురువారం సాయంత్రం మోటార్ సైకిల్‌పై తన సొంతూరు లింగంపర్తి వెళ్లి అక్కడ పని ముగించుకుని మల్లేపల్లి వెళుతుండగా మండల పరిధిలోని జెడ్.రాగంపేట వద్దకు వచ్చేసరికి రోడ్డు దాటుతున్న పశువులను తప్పించే ప్రయత్నంలో లోవరాజును లారీ బలంగా ఢీకొంది. అతను లారీ వెనక చక్రాల కింద పడ్డాడు. లారీ కొంత మేర ఈడ్చుకుపోవడంతో శరీర భాగాలు నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. గండేపల్లి పోలీసులు చక్రాల కింద ఇరుకున్న మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. గండేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీజీ ప్రవేశ పరీక్షలో మాచవరం విద్యార్థినికి 12వ ర్యాంకు


బ్రహ్మవర్ధిని

రాయవరం: మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన సత్తి బ్రహ్మవర్ధిని ఆంధ్రా యూనివర్శిటీ నిర్వహించిన ఫుడ్ అండ్ న్యూట్రిషన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశ పరీక్షలో 12వ ర్యాంకు సాధించింది. ఆంధ్రా యూనివర్శిటీ గురువారం ప్రకటించిన ప్రవేశ పరీక్షా ఫలితాల్లో హాల్ టిక్కెట్ నంబరు 40354011745 తో ప్రవేశ పరీక్ష రాసిన బ్రహ్మవర్ధిని 12వ ర్యాంకును సాధించింది. ఉత్తమ ర్యాంకు సాధించిన బ్రహ్మవర్ధిని తల్లి గృహిణి కాగా, తండ్రి రైస్‌మిల్ వ్యాపారి. యూపీపీఎస్సీ పరీక్షలకు ప్రిపేరవ్వడం, భవిష్యత్‌లో సివిల్స్ సాధించడం తన లక్ష్యమని బ్రహ్మవర్ధిని తెలిపింది.

యువకుడి ఆత్మహత్యాయత్నం


ప్రత్తిపాడులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కంచి శివ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన యువకుడు బుధవారం రాత్రి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి బంధువులు అందించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన కంచి శివ గంగాధర్ గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఒక కళాశాలలో బీటెక్ 2వ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం కళాశాలకు వెళ్లి వస్తుండగా అదే కళాశాలకు చెందిన కొంతమంది సీనియర్స్ పోలీసులమని చెప్పి శివని బస్సు దింపి కారులో ఎక్కించుకొని చేబ్రోలు తీసుకువెళ్లి భౌతికంగా దాడి చేశారు. ఏం జరిగిందో, ఎందుకు కొట్టారో తెలియక అవమాన భారంతో అతను ఒమ్మంగిలో పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న శివను ప్రత్తిపాడులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. దీనిపై బాధితుడి మేనమామ పెనుమాకుల శివ గురువారం గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

న్యాక్ బృందం పరిశీలన

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం న్యాక్ బృందం పర్యటించింది. న్యాక్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రామన్ రంగరాజన్, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ వైహెచ్ నాయక్ వడి, మెంబర్ డాక్టర్ అంజన్ కుమార్ నాయుడు ఈ బృందంలో ఉన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు గురువారం కళాశాల రికార్డులను తనిఖీ చేసి, అధ్యాపకుల పని తీరును పరిశీలించారు. అక్కడి భవనాలు, ల్యాబ్‌లను పరిశీలించి, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం కళాశాల అభివృద్ధి కమిటీతో సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు, వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేవీకేల సేవలు దేశానికే గర్వకారణం

- ఐసీఏఆర్-అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా
- ముగిసిన కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక సమీక్షా సమావేశాలు


విజయనగరం కృషి విజ్ఞాన కేంద్రానికి షీల్డ్‌ను అందజేస్తున్న ఐసీఏఆర్-అటారి డైరెక్టర్ మీరా, మాధూర్ తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా అందించే రైతుసేవలు, విస్తరణ కార్యక్రమాలు రాష్ట్రానికే కాకుండా భారతదేశానికే గర్వకారణమని ఐసీఏఆర్-అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎస్.మీరా అన్నారు. స్థానిక సీటీఆర్‌ఐ సమావేశ మందిరంలో మూడురోజులుగా జరుగుతున్న వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధనా సంస్థ జోన్ 10 కృషివిజ్ఞాన కేంద్రాల వార్షిక సమీక్ష సదస్సు గురువారంతో ముగిసింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ షేక్‌ఎన్‌మీరా మాట్లాడుతూ మున్ముందు ప్రతి ఒక్క కృషివిజ్ఞానకేంద్రం పోటీతత్వంతో పనిచేసి రైతు వద్దకు పరిశోధన ఫలితాలను నిరంతరం తీసుకువెళ్లాలన్నారు. ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు ఐసీఏఆర్-సీటీఆర్‌ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యులందరినీ డాక్టర్ షేక్‌ఎన్‌మీరా ఘనంగా సత్కరించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న భారత నూనెగింజల పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే మాథుర్ మాట్లాడుతూ కృషివిజ్ఞాన కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక సమీక్షా సమావేశాల ముగింపు కార్యక్రమం సందర్భంగా 72 కృషి విజ్ఞాన కేంద్రాలకు, కేవీకే ఆదేశాల ప్రకారం వివిధ అంశాలలో అత్యుత్తమ ప్రదర్శనకు గాను ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ప్రకృతి వ్యవసాయంలో కలవచర్ల సీటీఆర్ఐ-కేవీకేకు, వికసిత భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమానికి కందుకూరు సీటీఆర్ఐ-కేవీకేకు సర్టిఫికెట్లు లభించాయి. యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రానికి అత్యుత్తమ ప్రతిభ, విత్తన-నారు మొక్కల ఉత్పత్తి, కేవీకే ఆర్థికాభివృద్ధికి విశిష్టసేవలు అందించినందుకు రోలింగ్ షీల్డ్ ప్రదానం చేశారు. విజయనగరం కృషి విజ్ఞాన కేంద్రం 2023-24 సంవత్సరానికి ఉత్తమైనదిగా ఎంపిక కావడంతో షీల్డ్‌ను అందించారు. కలవచర్ల సీటీఆర్ఐ-కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వై.సుబ్బయ్య, కేవీకేల అధిపతులు పాల్గొన్నారు.

రైల్వే కోచ్ రెస్టారెంట్‌కు గ్రహణం

- ఇష్టారాజ్యంగా షాపుల ఏర్పాటుకు అనుమతి
- ప్రయాణికులకు కనిపించకుండా కొత్తగా షాపుల ఏర్పాటు
- ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురి విజ్ఞప్తి



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో రైల్వే కోచ్ రెస్టారెంట్ కనిపించకుండా ఏర్పాటు చేస్తున్న కొత్తషాపులు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో ప్రతిష్ఠాత్మకంగా వినూత్న తరహాలో ఏర్పాటు చేసిన రైల్వే కోచ్ రెస్టారెంట్ కనుమరుగు అయ్యే పరిస్థితి నెలకొంది. దక్షిణ మధ్య రైల్వేలో విజయవాడ డివిజన్‌లో కోట్లాది రూపాయల వ్యయంతో విజయవాడ, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లలో 24 గంటలూ అందుబాటులో ఉండే విధంగా వినూత్నంగా ఏర్పాటు చేశారు. రైల్వే కోచ్‌లో ఉన్న అనుభూతి కలిగించేలా ఇందులో సౌకర్యాలు ఉన్నాయి. ఇండియన్, చైనీస్ రుచులను అందించేందుకు ఏర్పాటు చేశారు. ప్రధాన రైల్వేస్టేషన్లో ప్రారంభించిన ఈ రైల్వే కోచ్ రెస్టారెంట్ నిత్యం రాకపోకలు సాగించే వేలాది మంది ప్రయాణికుల మనస్సులను ఆకట్టుకుంది. అయితే అధికారుల నిర్లక్ష్య పోకడలతో ఈ రైల్వే కోచ్ రెస్టారెంట్ కనిపించకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. రైల్వే కోచ్ రెస్టారెంట్‌ను కనిపించకుండా ఇష్టారాజ్యంగా అనేక వ్యాపార సంస్థలను రెల్వే కోచ్ రెస్టారెంట్ ఆవరణలో అనుమతిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసిన కోచ్ రెస్టారెంట్ ప్రాముఖ్యతను మసక బార్చే ఏర్పాట్లు జరుగుతున్నాయని, దీనిపై రైల్వే శాఖ విజయవాడ డివిజన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ రైల్వే కోచ్ రెస్టారెంట్ చిన్నారులను, యువతను ఆకట్టుకుందని క్షేత్రస్థాయి అధికారులు అనాలోచిత నిర్ణయాలతో ఇది కనిపించకుండా పోయే ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధం అవుతున్న షాపుల వ్యవహారంపై విచారణ చేపట్టి రైల్వే కోచ్ రెస్టారెంట్ ప్రయాణికులకు కనిపించేలా చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.